# ఇండియన్ ఎకానమీ

## పదకొండో పంచవర్ష ప్రణాళిక (2007–12)

**గత అయిదు దశాబ్దాల ప్రణాళికా కాలంలో స్థూల ఆర్థిక అంశాల్లో సంతృప్తికరమైన ప్రగతి సాధించినా, సంస్కరణల కాలంలో పేదరిక నిర్మూలన, ఉపాధి కల్పన, గ్రామీణ–పట్టణ వ్యత్యాసాలు, ఆదాయ అసమానతలు, ప్రాంతీయ అసమానతలు మాత్రం తగ్గలేదు. వ్యవసాయ రంగంలో వృద్ధిరేటు స్వల్పంగా ఉండటంతో రైతుల ఆత్మహత్యలు పెరుగుతున్నాయి. ఈ అంశాలను దృష్టిలో ఉంచుకునే పదకొండు, పన్నెండో ప్రణాళికల్లో సమ్మిళిత సుస్థిర వృద్ధి లక్ష్యానికి ప్రాధాన్యం ఇచ్చారు.**

పదకొండో పంచవర్ష ప్రణాళిక 2007 డిసెంబరులో జాతీయ అభివృద్ధి మండలి ఆమోదం పొందింది. వ్యవసాయం, విద్య, ఆరోగ్యం, అవస్థాపన సౌకర్యాలు లాంటి కీలక రంగాల్లో పెట్టుబడులు పెంచాలని ఈ ప్రణాళికలో భావించారు. 'సత్వర, సమ్మిళిత వృద్ధికి' (Faster and Inclusive Growth) ఈ ప్రణాళికలో ప్రాధాన్యం ఇచ్చారు.

**రంగాల వారీ లక్ష్యాలు:** పదకొండో ప్రణాళికలో వార్షిక వృద్ధిరేటు లక్ష్యం 9 శాతం. ప్రణాళిక చివరి సంవత్సరం నాటికి 10 శాతం వృద్ధిరేటు సాధించాలి. అయితే, 2008–09, 2009–10లో అంతర్జాతీయంగా ఏర్పడిన ఆర్థిక తిరోగమన పరిస్థితుల వల్ల వృద్ధిరేటును 8.1 శాతానికి సవరించారు.

✪ వ్యవసాయరంగంలో 4 శాతం, పారిశ్రామికరంగంలో 10 నుంచి 11 శాతం, సేవారంగంలో 9 నుంచి 11 శాతం వృద్ధిరేటు సాధించాలని లక్ష్యంగా నిర్దేశించారు.

### ప్రణాళిక – వనరుల కేటాయింపు

ప్రణాళికా వనరుల్లో భాగంగా ఈ ప్రణాళిక మొత్తం ప్రభుత్వరంగ కేటాయింపులు రూ. 36,44,718 కోట్లు. ఇందులో కేంద్రం వాటా రూ. 21,56,571 కోట్లు (59.2 శాతం). రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల వాటా రూ. 14,88,147 కోట్లు. వివిధ రంగాల మధ్య వనరుల కేటాయింపుల్లో సాంఘిక సేవలకు (30 శాతం) అధిక ప్రాధాన్యం లభించింది. తర్వాతి స్థానాల్లో శక్తి (23.4%), రవాణా, సమాచారం (18.3%) నిలిచాయి. సాంఘిక సేవల్లో భాగంగా విద్యపై అధిక మొత్తం వెచ్చించడం వల్ల ఈ ప్రణాళికను 'విద్యా ప్రణాళిక'గా అభివర్ణిస్తారు.

### జాతీయస్థాయి లక్ష్యాలు

పదకొండో ప్రణాళికలో 6 రంగాలకు సంబంధించిన 27 నిర్దేశిత ప్రమాణాలను (Monitorable targets) లక్ష్యంగా పేర్కొన్నారు. అవి:

**I. ఆదాయం – పేదరికం (6 అంశాలు)**

✪ స్థూల దేశీయోత్పత్తిలో (GDP) వృద్ధిరేటు 9 శాతం సాధించడం.

✪ వ్యవసాయరంగంలో వృద్ధిరేటు జీడీపీలో 4 శాతం సాధించడం.

✪ 58 మిలియన్ల మందికి కొత్తగా ఉపాధి కల్పించాలి.

✪ విద్యావంతుల్లో నిరుద్యోగం 5 శాతం కంటే తక్కువగా ఉండేలా చేయడం.

✪ నైపుణ్యం లేని శ్రామికుల నిజవేతనాలు 20 శాతం పెరిగేలా చూడటం.

✪ ప్రణాళిక కాలానికి పేదరికం 10 శాతం పాయింట్లు తగ్గించేందుకు కృషి చేయాలి.

**II. విద్య (5 అంశాలు)**

✪ ప్రాథమిక విద్యను అభ్యసించే వారిలో డ్రాపౌట్ రేటును 52.2 శాతం నుంచి 20 శాతానికి తగ్గించాలి.

✪ ప్రాథమిక స్థాయిలో విద్యా ప్రమాణాలు పెంచాలి.

✪ ఏడేళ్లకు పైబడిన వారిలో అక్షరాస్యత రేటును 85 శాతానికి పెంచడం.

✪ స్త్రీ, పురుషుల మధ్య అక్షరాస్యత వ్యత్యాసాన్ని 10 శాతానికి తగ్గించాలి.

✪ ఉన్నత విద్యను అభ్యసించేవారి శాతాన్ని ప్రస్తుతం ఉన్న 10 నుంచి 15 శాతానికి పెంచాలి.

**III. ఆరోగ్యం (5 అంశాలు)**

- 2012 నాటికి శిశు మరణాల రేటును 28 కి (1000), ప్రసూతి మరణాల రేటును 1 కి తగ్గించడం.
- 2012 నాటికి మొత్తం సంతాన సాఫల్యత రేటును 2.1 కి తగ్గించాలి.
- 2009 నాటికి అందరికీ పరిశుభ్రమైన తాగునీరు అందించాలి.
- పౌష్టికాహార లోపంతో బాధపడుతున్న పిల్లల సంఖ్యను ప్రస్తుత స్థాయి నుంచి సగానికి తగ్గించాలి.
- రక్తహీనతతో బాధపడుతున్న స్త్రీలు, బాలికల ప్రస్తుత శాతాన్ని సగానికి తగ్గించాలి.

**IV. మహిళలు, పిల్లలు (3 అంశాలు)**

- స్త్రీ, పురుష నిష్పత్తిని ప్రణాళికాంతానికి 935 కి (1000), 2016–17 నాటికి 950 కి పెంచాలి.
- ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల్లో స్త్రీలు, పిల్లలు కనీసం 33 శాతం ఉండేలా చూడాలి.
- ఎలాంటి నిర్బంధం లేకుండా పిల్లలందరూ సురక్షితమైన బాల్యాన్ని అనుభవించగలగాలి.

**V. మౌలిక సౌకర్యాలు (4 అంశాలు)**

- 2009 నాటికి అన్ని గ్రామీణ పేద కుటుంబాలకు విద్యుత్ సౌకర్యం కల్పించాలి.
- 2009 నాటికి 1000 మంది, ఆపైన జనాభా ఉన్న నివాస స్థలాలకు, 500 జనాభా కలిగిన గిరిజన, కొండ ప్రాంతాలకు అన్ని కాలాల్లో పనికొచ్చేలా రోడ్లు నిర్మించాలి.
- 2007 నాటికి అన్ని గ్రామాలకు టెలిఫోన్ సౌకర్యం, 2012 నాటికి బ్రాడ్‌బ్యాండ్ సౌకర్యాన్ని కల్పించాలి.
- 2012 నాటికి అందరికీ ఇళ్ల స్థలాలు, 2016–17 నాటికి పేదలందరికీ గృహ నిర్మాణం.

**VI. పర్యావరణం (4 అంశాలు)**

- అదనంగా 5 శాతం అడవులు, చెట్లను పెంచడం.
- 2012 నాటికి అన్ని పట్టణాల్లో ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్దేశించిన రీతిలో వాయుకాలుష్యరహిత పరిస్థితులను కల్పించడం.
- 2012 నాటికి అన్ని నదీజలాల్లో కాలుష్యం తొలగింపు.
- 2016–17 నాటికి ఇంధన సామర్థ్యాన్ని 20 శాతానికి పెంచాలి.

**వివిధ రంగాల అభివృద్ధి (సమీక్ష)**

- 11వ ప్రణాళికలో ప్రభుత్వరంగానికి కేటాయించిన మొత్తం రూ. 36,44,718 కోట్లు కాగా, ప్రణాళికాంతానికి వాస్తవంగా ఖర్చు చేసింది రూ. 33,70,179 కోట్లు మాత్రమే.
- ఈ ప్రణాళికలో జీడీపీ వృద్ధిరేటు లక్ష్యం 9 శాతం కాగా, వాస్తవంగా సాధించింది 7.9 శాతం మాత్రమే. అయితే ఇది పదో ప్రణాళికలో సాధించిన 7.8 శాతం కంటే స్వల్పంగా ఎక్కువ.
- ఈ ప్రణాళికలో వార్షిక వృద్ధిరేట్లను గమనిస్తే, 2007–08 సంవత్సరాల్లో 9.3 శాతం, 2008–09లో 6.7 శాతం, 2009–10లో 8.4 శాతం, 2010–11లో 8.4 శాతం, 2011–12 లో 6.5 శాతం నమోదైంది.
- వ్యవసాయ రంగంలో నిర్దేశించిన వృద్ధిరేటు 4 శాతం. అయితే 3.3 శాతం వృద్ధిరేటు మాత్రమే సాధ్యమైంది. అయితే ఇది పదో ప్రణాళికలో సాధించిన 2.1 శాతం కంటే ఎక్కువ.
- రంగాలవారీగా వృద్ధిరేటును పరిశీలిస్తే, రవాణా, సమాచార, నిల్వ రంగాల్లో అత్యధికంగా 12.7 శాతం వృద్ధి, ఫైనాన్సింగ్, బీమా, రియల్ ఎస్టేట్ రంగాల్లో 10.7 శాతం వృద్ధి, సామాజిక, వ్యక్తిగత సేవల్లో 8.4 శాతం వృద్ధి నమోదైంది.
- ఈ ప్రణాళికలో పెట్టుబడి రేటు జీడీపీలో 37.6 శాతం కాగా, పొదుపు రేటు 32.9 శాతం.

## పన్నెండో ప్రణాళిక (2012 – 17)

పన్నెండో ప్రణాళిక తుది ముసాయిదాను డాక్టర్ మన్మోహన్‌సింగ్ సారథ్యంలోని జాతీయ అభివృద్ధి మండలి 2012 డిసెంబరులో ఆమోదించింది. 2012 ఏప్రిల్ 1 నుంచి 2017 మార్చి 31 కాలానికి ఈ ప్రణాళికను రూపొందించారు. పన్నెండో పంచవర్ష ప్రణాళిక ప్రారంభానికి ముందు 2008–09లో ప్రపంచవ్యాప్త సంక్షోభం కారణంగా స్థూల ఆర్థిక వాతావరణం అనిశ్చితంగా ఉంది. అయితే, అధికంగా ఉన్న పెట్టుబడి రేటు, ప్రైవేట్ రంగ పొదుపు లాంటివి పన్నెండో పంచవర్ష ప్రణాళికలో అధిక వృద్ధిరేటును సాధించడానికి అనుకూల అంశాలుగా చెప్పొచ్చు.

★ పన్నెండో ప్రణాళిక ముఖ్య లక్ష్యం 'సత్వర, కొనసాగించగలిగే, అధిక సమ్మిళిత వృద్ధి' (Faster, sustainable and more inclusive growth). వృద్ధిని సమ్మిళితం చేయడంలో కింద పేర్కొన్న అంశాలు ముఖ్య సాధనాలుగా చెప్పొచ్చు.

- వ్యవసాయరంగంలో మెరుగైన పనితీరును సాధించడం.
- పారిశ్రామికరంగంలో ఉద్యోగ అవకాశాల కల్పనను వేగవంతం చేయడం.
- విస్తృతంగా విస్తరించేలా సరైన వ్యవస్థాపన సౌకర్యాల కల్పన.
- ఆరోగ్యం, విద్య, నైపుణ్యాల అభివృద్ధికి ఎక్కువ ప్రయత్నం చేయడం.
- పేదవారి కోసం ఉద్దేశించిన పథకాల ప్రభావాన్ని మెరుగుపరచడం.
- సామాజికంగా వెనుకబడిన వర్గాలకు ప్రత్యేక పథకాల రూపకల్పన.
- వెనుకబడిన ప్రాంతాల కోసం ప్రత్యేక ప్రణాళికలు రూపొందించడం.

### రంగాలవారీ వృద్ధిరేటు లక్ష్యాలు

- వ్యవసాయరంగం: 4 శాతం
- పారిశ్రామికరంగం: 8.1 శాతం
- సేవారంగం: 9.1 శాతం
- స్థిర ధరల వద్ద జీడీపీలో పెట్టుబడి రేటు: 39.3 శాతం
- ప్రస్తుత ధరల వద్ద జీడీపీలో పొదుపు రేటు: 34.2 శాతం

**మొత్తం ప్రభుత్వరంగ పెట్టుబడి:** ఈ ప్రణాళికలో మొత్తం ప్రభుత్వరంగ పెట్టుబడి రూ.80,50,123 కోట్లు. ఇందులో అత్యధికంగా సాంఘిక సేవలకు 34.7 శాతం, శక్తి రంగానికి 18.8 శాతం, రవాణా రంగానికి 15.7 శాతం కేటాయించారు.

### లక్ష్యాలు

ఈ ప్రణాళికలో ఆర్థికవృద్ధి, పేదరికం – ఉద్యోగిత, విద్య, ఆరోగ్యం, అవస్థాపన సదుపాయాలు, పర్యావరణం – సుస్థిరత, సేవలు అనే 7 రంగాలకు సంబంధించి సాధించాల్సిన 25 లక్ష్యాలను నిర్దేశించారు. **అవి:**

**I. ఆర్థిక వృద్ధి (4 అంశాలు)**

- వాస్తవ జీడీపీ వృద్ధిరేటు 8 శాతం
- వ్యవసాయ వృద్ధిరేటు 4 శాతం
- తయారీరంగ వృద్ధిరేటు 10 శాతం
- 11వ ప్రణాళికలో సాధించిన వృద్ధిరేటు కంటే 12 వ ప్రణాళికలో ఎక్కువ వృద్ధిని సాధించాలి.

**II. పేదరికం, ఉద్యోగిత (2 అంశాలు)**

- తలల లెక్కింపు నిష్పత్తి ఆధారంగా పేదరికం శాతాన్ని 10 పాయింట్లు తగ్గించాలి.
- వ్యవసాయేతర రంగంలో కొత్తగా 50 మిలియన్ల మందికి ఉపాధి అవకాశాలు కల్పించాలి. మరో 50 మిలియన్ల మందికి నైపుణ్యాన్ని మెరుగుపరచాలి.

**III. విద్య (3 అంశాలు)**

- ✪ ప్రణాళికాంతానికి Mean year of Schooling (7 సంవత్సరాలపైన ఉన్నవారిలో) మెరుగుపరచాలి.
- ✪ ఉన్నత విద్యలో అదనంగా 2 మిలియన్ల సీట్లు పెంచాలి.
- ✪ ప్రణాళికాంతానికి పాఠశాలలో లింగ వ్యత్యాసాన్ని, సాంఘిక వ్యత్యాసాన్ని నిర్మూలించాలి.

**IV. ఆరోగ్యం (3 అంశాలు)**

- ✪ శిశు మరణాల రేటును 25 కి, ప్రసూతి మరణాల రేటును 1 కి తగ్గించాలి.
- ✪ ప్రణాళికాంతానికి మొత్తం పునరుత్పత్తి రేటును 2.1 కి తగ్గించాలి.
- ✪ పౌష్టికాహార లోపంతో బాధపడుతున్న 0–3 సంవత్సరాల మధ్య ఉన్న పిల్లల సంఖ్యను ప్రస్తుత స్థాయి నుంచి సగానికి తగ్గించాలి.

**V. అవస్థాపన సదుపాయాలు (8 అంశాలు)**

- ✪ ప్రణాళికాంతానికి మౌలిక సదుపాయాల్లో పెట్టుబడులను జీడీపీలో 9 శాతానికి పెంచాలి.
- ✪ స్థూల నీటి పారుదల భూమిని 90 మిలియన్ హెక్టార్ల నుంచి 103 మిలియన్ హెక్టార్లకు పెంచాలి.
- ✪ ప్రణాళికాంతానికి అన్ని గ్రామాలకు విద్యుత్ సౌకర్యం కల్పించాలి.
- ✪ ప్రణాళిక పూర్తయ్యే నాటికి అన్ని గ్రామాలను పక్కా రోడ్లతో (All weather roads) అనుసంధానించాలి.
- ✪ జాతీయ, రాష్ట్ర రహదారులను కనీసం రెండు లైన్ల రహదారులుగా మార్చాలి.
- ✪ ప్రణాళికాంతానికి తూర్పు, పడమర ఫ్రైవేట్ కారిడార్‌లను పూర్తిచేయాలి.
- ✪ గ్రామీణ టెలీ సాంద్రతను 70 శాతానికి పెంచాలి.
- ✪ ప్రణాళికాంతానికి 50 శాతం గ్రామాలు 'నిర్మల్ గ్రామ' హోదాను పొందాలి.

**VI. పర్యావరణం, సుస్థిరత (3 అంశాలు)**

- ✪ ప్రణాళికా కాలంలో ఏటా 1 మిలియన్ మొక్కలను నాటాలి.
- ✪ పునరావృత విద్యుత్ సామర్థ్యాన్ని అదనంగా 30 వేల మెగావాట్లకు పెంచాలి.
- ✪ 2020 నాటికి ప్రస్తుతం ఉన్న వాతావరణ కలుషితాలను 2005 స్థాయితో పోల్చినప్పుడు 20–25 మధ్య తగ్గించాలి.

**VII. సేవల అందుబాటు (2 అంశాలు)**

- ✪ ప్రణాళిక చివరి నాటికి దేశంలోని 90 శాతం కుటుంబాలకు బ్యాంకింగ్ సేవలు అందించాలి.
- ✪ ప్రణాళిక చివరి నాటికి ఆధార్ కార్డులు, బ్యాంకు ఖాతాల ద్వారా సబ్సిడీలు, ఇతర సంక్షేమ కార్యక్రమాల చెల్లింపులు అందించాలి.

**రచయిత: సీహెచ్. వెంకట్ రెడ్డి**